RESEARCH ARTICLE

INDIAN JOURNAL OF
MULTILINGUAL RESEARCH AND DEVELOPMENT

Asian Research Association

DOI: 10.54392/ijmrd2221

# Descriptive the language style of Naganatyam

# నాగనాట్యంలోని భాషాశైలి

**CH. Savithri [a,*]**

[a] School of Indian Languages & Comparative Literature, Tamil University, Thanjavur–613010, Tamil Nadu, India
*Corresponding author Email: savithritamiluniversity@gmail.com

DOI: https://doi.org/10.34256/ijmrd2221
Received: 19-02-2022; Revised: 30-05-2022; Accepted: 04-06-2022; Published: 20-06-2022

**Abstract:** N.Chellappa IAS's Naganatyam poetry anthology contains a total of 50 poems. The pivotal purpose of this paper is to consider these poems as the foremost research sources and divide them into three elements and illustrate them as exemplary. Before that, it is necessary to appreciate the poet's merits and understand the overview of the book. In this paper deal mainly with three topics: 1. Poetic titles; 2. Poetic objects; and 3. Poetic style. Most of the poems of Chellappa are mainly about love. Although they seem subtle, it is not an exaggeration to say that when one examines them in depth, it goes beyond the passions of love, such as Piety, Movement of the soul, Attainment of God, Salvation, Union of oneself with the Supreme of the soul, Standing on the side of God and Riding in bliss. All his poems are lyrics that speak to the soul. The valid poems prove the fact that there are no caste differences between the Jeevatma and Paramatma. The descriptions and parables he uses in his poems are so farfetched and bizarre, and it is clear that he is a fan of nature. In his preface, he says, "Poems written by a Tamil poet." But when one examines the collection of Naganatyam poems, one finds no Tamil trace (except for the words Arangetram, Ponnur, and Kumari). Moreover, these poems appear to be pure Telugu, and do not sound as poetic poems from a Tamil pen. They sound efficacious, and pray on behalf of the Telugus to adorn the mother of Telugu Sahitya Pudami. With thousands of Telugu poems overflowing from his pen, sincerely pray to God that the nature of the poetry he worships will continue to give him physical and mental strength and as well longevity.

**Keywords:** Anthology of Poetry, Poetry Style, Linguistic Tradition, Nature Description, Phrases, Parable

**Subject Specialization:** Telugu

---

ఎన్. చెల్లప్పగారి **నాగనాట్యం** కవితా సంపుటిలో మొత్తం 50 కవితలు ఉన్నాయి. ఈ కవితా సంకలనంలోని కవితల్ని ప్రధాన పరిశోధన ఆకరాలుగ తీసుకొని వాటిని మూడు అంశాలుగ విభజించి సోదాహరణగ వివరించడం ఈ పత్రం యొక్క ముఖ్య ఉద్దేశం. దానికి ముందుగ కవి విశేషాలు, గ్రంథపరిచయం తెలుసుకోవడం అవసరం. కాబట్టి వాటిని ముందుగ తెలియజేస్తున్నాను.

## కవి విశేషాలు

### జననం

కవి చెల్లప్పగారు తమిళనాడు, తూత్తుక్కుడి జిల్లాలో 1952 ఫిబ్రవరి 9వ తారీఖున సూసై మాణిక్కం, దేవనేశం దంపతులకు జన్మించారు.

### విద్య

ఈయన తమిళనాడులోని పాళయాంకోట్టై ఊరిలో సెయింట్ జేవియర్స్ కళాశాల ఆంగ్ల శాఖలో బి.ఎ. డిగ్రీ, మధురై కామరాజర్ విశ్వవిద్యాలయ ఆంగ్ల శాఖలో ఎమ్,ఎ, పట్టం పొందారు. ఆ తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చట్టవిద్య పూర్తిచేసి, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆర్థిక శాస్త్రంలో పి.హెడి. పట్టా పొందారు.

### ఉద్యోగం

1979లో మధురై కామరాజర్ విశ్వవిద్యాలయం ఆంగ్ల శాఖలో సహాయక ఆచార్యులుగా పని ప్రారంభించారు. 1976 లో ఇండియన్ రెవిన్యూ సర్వీస్ లభించి, 1979లో ఆంధ్రప్రదేశ్ లో ఐ.ఎ.ఎస్. అధికారిగ ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ లో 1987 - 1990 మధ్యకాలంలో శ్రీకాకుళం హైదరాబాద్ జిల్లాలకు జిల్లా కలెక్టరుగా నియమిమ్పబడ్డారు. పంచాయితీరాజ్ కమిషనరుగా, స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీగా, ఆంధ్రప్రదేశ్ హ్యూమన్ రైట్స్ కమిషన్ కార్యదర్శిగా పనిచేశారు. పేద విద్యార్థులకు సమగ్ర విడుది ఏర్పాటు చేయడంలోను, వెనుకబడిన తరగతులకు చెందిన కళాశాల విద్యార్ధులకు హాస్టల్ వసతి కల్పించడంలోను కీలకస్థానాన్ని నిర్వహించారు.

ఫుడ్ కార్పరేషన్ ఆఫ్ ఇండియాలో సీనియర్ రీజనల్ మేనేజరుగా పనిచేశారు. 2004 -2005 మధ్యకాలంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ చైర్మనుగా పనిచేసి, కడపలో ఒక క్రొత్త బ్రాంచిని ప్రారంభించారు. కీర్తి శేషులు ఎమ్.ఆర్.బాయ్, ఎన్.కాశిపాండియన్ వంటి ప్రముఖుల శిక్షణలో పనిచేసి నీతి, నిజాయితి అధికారిగా, పరిపాలనా దక్షుడుగా పేరు పొందారు.

### రచనలు :

ఈయన తమిళము, తెలుగు, ఆంగ్ల బాషల్లో చాలా పుస్తకాలు రాసారు.

### తమిళ పుస్తకాలు

- చెంకాదల్
- ఉళ్ళక్కుమురల్
- ఉదిరిప్పూకల్
- ఓడైక్కవిద్దైకళ్
- కూట్టిర్కు వెళియే
- మీన్డుమ్ ఇళవేణియిల్
- విడైయే ఇల్లాద వినాక్కళ్
- పుదువెళ్ళం
- ఇందిర కావియం/నాన్మరై విళక్కం (తమిళ ప్రభుత్వ బిరుదుపొందింది)
- కూవు కోళియే ... (తిరుగుబాటు కవితలు)
- కనవిల్ సిరిత్త క్కాట్టుపూక్కల్
- నిళర్ కనిన్ద కనికళ్
- పదినాలామ్ ఇరవు
- పుల్లిల్ తూంగియ పని (స్వియచరిత్ర)

### తెలుగు పుస్తకాలు

- నాగనాట్యం
- దక్షిణాయనం

### ఆంగ్ల పుస్తకాలు

- The Cuddapah Roots (Auto biography Part - II)

### అనువాద పుస్తకాలు

- వౌవాలిన్ పయనం (గబ్బిలం)
- చుట్టుమ్ వళిచ్చుడరో

### పరిశోధనా పత్రాలు

- రొయ్యల పెంపకం (ఆంగ్లంలో)
- మట్టైక్కప్పట్ట మామన్నర్ వరలాఱు (సమూహ పరిశోధన వ్యాసం)
- తిరువళ్ళువర్ కాల కుముగ వరలాఱు (తిరువళ్ళువర్ కాల సామాజిక చరిత్ర)

### సమాజ బాధ్యత

ఈయన ఆర్థికంగా వెనుకబడియున్న విద్యార్థులకు మంచి విడుది గృహాన్ని ఏర్పాటు చేసిచ్చారు. చాలా వెనుకబడ్డ తరగతులకు చెందిన కళాశాల విద్యార్థులకు బస ఏర్పాటు చేయడం ఈయన ప్రధాన కర్తవ్యంగా భావించారు. ఫుడ్ కార్పరేషన్ ఆఫ్ ఇండియాలో సీనియర్ రీజనల్ మేనేజరుగా పనిచేసే సందర్భంలో 5 లక్షల టన్నుల గిడ్డంగి వసతులను ఉచితంగ ఏర్పరచారు. ప్రొఫెసర్.వి.ఐ.సుబ్రమణ్యం, ఎన్.కాశిపాండియన్, జస్టిస్ ఆవుల సాంబశివరావులతో కలసి చిత్తూరు జిల్లాలోని కుప్పంలో ద్రావిడ విశ్వవిద్యాలయ స్థాపనకు అవిరళ కృషి చేసారు.

### పుస్తకం గురించి

**నాగనాట్యం** పుస్తకంలోని విషయాల్ని రెండు విధాలుగ పరిగణించడం జరిగింది. అవి :-

1. గ్రంథ నామకరణ
2. గ్రంథ నిర్మాణం

### గ్రంథ నామకరణ

"భారత గ్రామీన జనానికి పాములను ఆడించే బూర కొత్తదేమికాదు. ఈ చిన్న వాయిద్య సాధనం కళ్ళు చెవులను మాత్రమే కాదు, హృదయాన్ని కూడా తాకుతుంది. ఇందులో భయం, ఆందోళన, సృజనాత్మకత ఉన్నాయి. ఇవన్నీ సంగీత రాగంలో విలీనమవుతాయి. ఈ సంగీతం పాములను ఆడించడమే కాదు, మానవుల హృదయాలను కూడా తాకుతుంది. పాము నాట్యం కొత్త సొకసును చేకూరుస్తుంది. దాంతో సొకసు సంగీతంతో మేళవింపై సృజనాత్మకతకు దారితీస్తుంది. ఈ గేయ కావ్యానికి "నాగనాట్యం" అని ఎందుకు నామకరణం చేశానంటే కరుణామయుడైన భగవంతుని ధ్యానిస్తూ సమస్తాన్ని ఆ పరమాత్మకు సమర్పించుకొని ఆయనలోనే అంతర్లీనమైయ్యే, సాంద్రంభైన ఆధ్యాత్మిక చింతనను స్ఫురింపజేస్తుంది" - అని చెల్లప్పగారు ఈ పున్తకానికి ఎందుకు 'నాగనాట్యం' అని పేరు పెట్టారో ముందుమాటలో తెలియపరచారు. చాల మంది గ్రంథకర్తలు గ్రంథనామకరణానికి కారణాలు చెప్పరు. అయితే ఈయన ఎందుకు ఈ పున్తకానికి **నాగనాట్యం** అని పేరు పెట్టారో పాఠకులు తెలునుకోవాలనే ఉద్దేశంతో తానే ముందుకు వచ్చి కారణాన్ని తెలియజేసారు.

### గ్రంథ నిర్మాణం

యాభై కవితలతో అల్లుకున్న **నాగనాట్యం అనే** ఈ పున్తకంలోని విషయాన్ని అనుసరించి మూడు అంశాలుగా విభజించడం జరిగింది. ఒక్కొక్క అంశాన్ని ఎనిమిదేసి ఉప శీర్షికలుగ వింగడించి వాటిని క్రింది పట్టికలో చూపబడ్డాయి. అవి :-

1. **కవితా శీర్షికలు**
2. **కవితా వస్తువు**
3. **కవితా శైలి**

| క్రమ సంఖ్య | కవితా శీర్షికలు | కవితా వస్తువు | కవితా శైలి |
|---|---|---|---|
| 1 | యతి ప్రాసలు | ప్రేమ /అనురాగం | భాష ఆదాయం |
| 2 | ఆమ్రేడితం | గాఢ భక్తి | ప్రకృతి వర్ణన |
| 3 | వివరణాత్మకత | మానవత్వం | ఉపమానాలు |
| 4 | ఏక పదం | మతం | పద ప్రయోగం |
| 5 | ద్వి పదం | జీవిత భాగస్వామి | అన్య భాషా పదాలు |
| 6 | త్రి పదం | ప్రేమ | చిహ్నాలు / గుర్తులు |
| 7 | సంయుక్త పదాలు | శరీరమే ప్రధానం | నేనే ప్రశ్న నేనే జవాబు |
| 8 | అన్య భాషా పదాలు | పరమేశ్వరుని వెదకుట | మనసు ఊసు |

## కవితా శీర్షికల నిర్మాణం

నాగనాట్యం అనే ఈ పుస్తకంలో ఉన్న కవితా శీర్షికలన్నీ కూడా 8 రకాల నిర్మాణంలో ఉన్నాయి. వాటిని క్రింది పట్టికలో చూపడం జరిగింది.

| క్ర. సం | యతి ప్రాసలు | ఆమ్రేడితం | వివరణాత్మకత | ఏక పదం | ద్వి పదం | త్రి పదం | సంయుక్త పదం | అన్య భాషా పదం |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | చినుకులాంటి చిరునవ్వు | చూడగా చూడగా | రెక్కలున్న నిమిషాలు | ఓలి | పూల వర్షం | జీవిత రణ రంగం | కవితావళి | నా ఫోటో |
| 2 | రూపూ చూపూ | చూడకలా చూడకలా | నీ చూపుకోసం | నాటిక | నా ఒటమి | శివ శక్తి దర్శనం | ప్రేమాగ్ని | అరంగేట్రం |
| 3 | ముద్దుల ముచ్చట్లు | | మూగవాడి గోల | ప్రమిద | నిజ స్వరూపం | | జ్ఞా నాగ్ని | |
| 4 | నవం నవం శుభం శుభం | | నవ్వుతోంది ఆ చెట్టు | కానుక | ప్రేమకావ్యం | | రుణాను బంధం | |
| 5 | స్పృతిగా స్మృతిగా | | మామిడి పండ్ల కోత | | ఆత్మ రాగాలు | | | |
| 6 | మలినమే మహాబలం | | విడిపోయిన ముక్క | | కవి మనస్తత్వం | | | |
| 7 | కెరటాల కన్యలు | | ప్రేమకో ముద్దు | | తియ్యని బాట | | | |
| 8 | పునాదిలేని పూరిల్లు | | | | మిణుగురు పురుగులు | | | |
| 9 | | | | | అద్వైత ప్రేమ | | | |
| 10 | | | | | గుండె సన్నాయి | | | |
| 11 | | | | | వాయు ప్రసాదం | | | |
| 12 | | | | | ముత్యాల అనుభవం | | | |
| 13 | | | | | ప్రేమ బిందు | | | |
| 14 | | | | | అనంత వల యం | | | |
| 15 | | | | | వలపు సాగు | | | |
| 16 | | | | | ప్రేమ తత్త్వం | | | |
| 17 | | | | | పసిగడ్డి ఉయ్యాల | | | |
| 18 | | | | | దక్షిణవాయువు | | | |
| 19 | | | | | ప్రేమ వైభవం | | | |
| 20 | | | | | ముద్దుల హారం | | | |

మొత్తం 8+2+7+4+20+3+4+2 = 50

పై పట్టికలో చెప్పబడ్డ 50 కవితా శీర్షికలు కూడా కవితల్లో పదాలుగాను, వాక్యాలుగాను వాడబడినవే.

## భాష ప్రయోగం

ఈ కవితా సంపుటిలో ఇచ్చిన 50 శీర్షికల్లో తెలుగు, సంస్కృతం, తమిళం, ఆంగ్లం, హిందుస్థాని భాషా పదాలు కనబడుతున్నాయి. వాటి వివరణ:

తెలుగు = 19

సంస్కృతం = 21

తమిళం = 1

తెలుగు + ఆంగ్లం = 1

సంస్కృతం + తెలుగు = 1

తెలుగు + సంస్కృతం = 5

సంస్కృతం + హిందుస్థాని = 1

హిందుస్థాని + సంస్కృతం = 1

---------------------

మొత్తం = 50

వీటిని క్రింది పట్టిలో చూపడం జరిగింది.

| క్ర . సం | తెలుగు | సంస్కృతం | తమిళం | తెలుగు + ఆంగ్లం | సంస్కృతం + తెలుగు | తెలుగు + సంస్కృతం | హిందుస్థాని + సంస్కృతం | సంస్కృతం + హిందుస్థాని |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | నా ఓటమి | ప్రేమ కావ్యం | అరంగేట్రం | నా ఫోటో | రూపూ చూపూ | పూల వర్షం | జవాబు లేని ప్రశ్న | ప్రేమకో హద్దు |
| 2 | చినుకు లాంటి చిరునవ్వు | ఆత్మ రాగాలు | | | | రెక్కలున్న నిమిషాలు | | |
| 3 | నీ చూపు కోసం | నవం నవం శుభం శుభం | | | | ముత్యాల అనుభవం | | |
| 4 | చూడగా చూడగా | కవితావళి | | | | కెరటాల కన్యలు | | |
| 5 | చూడకలా చూడకలా | కవి మనస్తత్వం | | | | ముత్యాల హారం | | |
| 6 | ముత్యాల ముచ్చట్లు | ప్రేమాగ్ని | | | | | | |
| 7 | మూగవాడి గోల | జీవిత రణరంగం | | | | | | |
| 8 | నవ్వుతోంది ఆ చెట్టు | అద్వైత ప్రేమ | | | | | | |
| 9 | తియ్యని మాట | వాయు ప్రసాదం | | | | | | |
| 10 | పునాది లేని పూరిల్లు | స్తుతిగా స్మృతిగా | | | | | | |
| 11 | మామిడి పండ్ల కోత | శివశక్తి దర్శనం | | | | | | |
| 12 | ఓలి | ప్రేమ బిందు | | | | | | |
| 13 | మిణుగురు పురుగు | అనంత వలయం | | | | | | |
| 14 | గుండె సన్నాయి | జ్ఞానాగ్ని | | | | | | |
| 15 | వలపుసాగు | ప్రేమ తత్త్వం | | | | | | |
| 16 | విడిపోయిన ముక్క | మలినమే మహా బలం | | | | | | |
| 17 | ప్రమిద | నాటిక | | | | | | |
| 18 | పసిగడ్డి ఉయ్యాల | దక్షిణ వాయువు | | | | | | |
| 19 | కానుక | ప్రేమ వైభవం | | | | | | |
| 20 | | నిజ స్వరూపం | | | | | | |
| 21 | | ఋణాను బంధం | | | | | | |

## కవితా వస్తువు

కవి చెల్లప్పగారు తన పుస్తకంలోని ముందుమాటలో కవితావస్తువు గురించి -

**నాగనాట్యం** పేరిట ఉన్న ఈ కవితలు ప్రాథమికంగా అజ్ఞానం నుంచి దైవత్వం వైపుకు మానవ ఆత్మ ప్రయాణం గురించి తెలియజేస్తాయి. ఆత్మ సాగించే ఈ ఆధ్యాత్మిక ప్రయాణంలో తనను తాను తెలుసుకోవడం, సహచరులను, దేవుణ్ణి, ఇతర జీవులను తెలుసుకోవడంలో పర్యావరణం ముఖ్య భూమికను

పోషిస్తుంది. మానవులందరి ఆత్మ ఒకటేనన్న శిరిడిశాయి అంతః దృష్టిని ఈ కవితలలో చూడవచ్చు" అని అంటున్నారు. అంతే కాకుండా ఈ గ్రంథానికి అభినందనలు తెలిపిన డా.సి.నారాయణరెడ్డి ఈ కవితా సంపుటి ప్రణయభావాల సమీకృతి అని, తన కవితా పుష్పాలతో దేవుణ్ణి పూజించాడీ కవి అని తెలిపారు. అలాగే పట్నాల సుధాకర్ గారు " ఒక ప్రియుడు ప్రేయసి కోసం పడే విరహ వేదన కనిపించదు. ఒక భక్తుడు దేవుని దర్శనం కోసం పడే తపన, ఆర్తి, ఆవేదన, తృష్ణ కనిపిస్తుంది" అని అంటున్నారు. ఇలా ముగ్గురు కూడా ఒకే విధమైన అభిప్రాయాన్ని వెలిబుచ్చినప్పటికి, ఈ కవితల్లోని విషయాన్ని బట్టి కవితా వస్తువును ముందే పట్టికలో చూపినట్లు 8 రకాలుగ పరిశీలించబడింది. అవి:

### ప్రేమ/అభిమానం

ఈ కవితా సంపుటిలో 'ప్రేమ' అనే పేరుతో ఏడు కవితలు ఉన్నాయి. ఈ కవితల్లో చెప్పబడ్డ ప్రేమను కవి రెండు విధాలుగ చూసారు. ఒకటి మానవునిపై దేవుడు కురిపించే ప్రేమ, రెండు మానవుడు దేవునిపై చూపే ప్రేమ. దీనినే కవి నారాయణరెడ్డి - తన అభినందనలో 'ఈ పుస్తకంలో ప్రేమ పేరుతో ఏడు శీర్షికలున్నాయి. ప్రేమ కావ్యం, ప్రేమాగ్ని, అద్వైత ప్రేమ, ప్రేమ బిందు, ప్రేమకో హద్దు, ప్రేమ వైభవం, ప్రేమ తత్వం. ప్రియురాలి పట్ల ప్రేమకు సంకేతాలున్నట్లు పైకి కనిపించినా ఆ ప్రేమామయుడైన దేవునిపట్ల భక్తి భావాలకు ప్రతీకలుగా నిలిచాయి ఈ కవితలు. ఇందులోని వచన కవితలన్నీ దైవ ప్రేమను దర్శింప చేసేవే." అని అన్నారు. ఉదాహరణకు -

### ప్రేమాగ్ని కవితలో -

**బ్రహ్మత్వం లాంటిది ని ప్రేమాగ్ని**
**ని ప్రేమ కాంతిలో**
**ప్రకాశిస్తోంది ఈ ప్రపంచం (పుట.26)**

కరుణా సముద్రుడైన ఆ విశ్వేశ్వరుని ప్రేమ, అంధకారంలో కొట్టుమిట్టాడుతున్న ప్రపంచంలోని ప్రజానీకాన్ని వెలుగిస్తోందన్న భావన కనిపిస్తుంది అని అంటారు నారాయణరెడ్డిగారు.

**రెక్కలున్న మనిషి** అనే కవితలో ఒక భక్తుడు దేవునిపై ఉంచిన ప్రేమ తపనను వెలిబుచ్చే విధంగ -

**నీతో నేనున్నప్పుడు**
**నిమిషములకు రెక్కలు మొలుస్తున్నాయి**
**మాసాలు గంటలుగా**
**గంటలు కనిపించని నిమిషాలుగా**
**కరిగిపోతున్నాయి**

---------------------

**నీవు లేనప్పుడో**
**మొలిచిన రెక్కలు ఊడి పోతున్నాయి**

--------------------

**ప్రేమ వెలుతురుకై**
**ఆ వెలుతురులో**
**ఎదురుచూస్తున్నాను యుగ యుగాలుగ**

అని దేవుని ప్రేమకు పరితమించే తపన కనబడుతుంది.

### వలపుసాగు కవితలో

భక్తుడు దేవునిపై ప్రేమ కురిపించినను ఆ ప్రేమను స్వీకరించేందుకు దేవుని మనసులోను ప్రేమ అనేది ఉండాలికదా? దేవుడు నా వైపు చూడడా? నా ప్రేమను అంగీకరించడా? అని పరితపించే మనసు ఇలా వాపోతున్నది.

**కొండ లోయలో**
**గుబురు పొదల మాగాణి**

------------------------------

**వసంతంలో కురిసిన వర్షానికి**
**మంచి విత్తనాలేసి**

-------------------------------

**ప్రేమ పండించడానికి**

**నేలకు కూడా ప్రేమ ఉండాలి కదా? (పుట : 38)**

ఒక పక్ష ప్రేమికుడిలా ఎంతో పోరాడి పోరాడి దేవుడు కరుణించలేదనే చింత, తృష్ణ పై కవితలో కనబడుతుంది.

## గాఢ భక్తి

కవి తన భక్తి మార్గంలో ఎలాంటి సందేహమో, తత్తరపాటో లేకుండా, దేవుడు దేవతల పేర్లు తెలుపకుండా చాలా మటుకు ప్రకృతినే పరబ్రహ్మాగా చిత్రించి తన భక్తిని ప్రదర్శించారు. తన భక్తి మార్గానికైన ఆత్మ ప్రయాణాన్ని ప్రకృతిచే ఆకర్షితులైనందు వలన ప్రకృతి ఆధారం చేసుకొనే పయనించ దలచారు. ప్రకృతి మరియు ప్రపంచ శక్తియే ఆత్మను పరమాత్మ దగ్గరకు చేర్చేదిగా ఉంటుంది అనే విషయంలో చాలా దృఢముగా ఉన్నారు. ఈ నమ్మకాన్ని వెలిపరచే **ముత్యాల అనుభవం** అన్న కవితలో -

**చదవగా చదవగా**
**చదివింది చాలదన్నట్లు**
**అంతులేని నీ సౌందర్య సాగరంలో**
**మునిగి మునిగి తెచ్చిన**
**ముత్యాల అనుభవం**
**తేగా తేగా**
**తెచ్చిన ముత్యాలు కొంచమని**
**తేవలసింది ఎక్కువని**
**గొణుకుతోంది నా గుండె**

ఈ విధంగా మనసులోనే వాపోతున్నారు కవిగారు.

## మానవత్వం

భక్తి మార్గంలో మానవత్వానికి ఒక స్థిరమైన స్థానాన్ని ఇచ్చి ఆత్మ పరమాత్మలో చేరే ప్రయాణంలో మనిషికి కావలసిన అతి ముఖ్య గుణాల్లో ఒకటైన మానవత్వమే ఆధార భూతంగా పరమేశ్వరుడు ఎదురుచూస్తున్నాడు అనే విషయాన్ని చాలా సున్నితమైన ఆధ్యాత్మిక ధోరణిలో, పరమేశ్వరుడే మానవత్వంలో మెలగుతున్న అందరికి ఆధారంగా ఉన్నాడని, మానవత్వ గుణం కలిగిన జీవుని మనస్సులో పరమాత్మయైన దేవుడు వాసం చేస్తున్నాడని చెల్లప్పగారు తమ కవితల్లో చిత్రించియున్నారు. ఏడు స్వరాలలాగా ఆరోహణ అవరోహణలతో మారి మారి, పైకి క్రిందకి అల్లల్లాడే ప్రాణం నిలిచిపోతే, నా గుండెల్లో కొలువైయున్న నీ గతి ఏమౌను? అని పరమేశ్వరుని ప్రశ్నించి, పరమాత్మలో ఐక్యమైన స్థితిని **ప్రమిద** (పుట : 44) అన్న కవితలో ఇలా చెప్తున్నారు కవిగారు.

**మానవతకు మారుపేరైన నువ్వు**
**ఇంకో గుండెను పారేసేందుకు**
**ఎందుకు ముందుకొచ్చావు**
**ఈ గుండెని**
**నీ ఊపిరి స్వరాలకు**
**సరిగమలూదే నా గుండెని వొదిలేస్తే**
**నిన్ను నువ్వే పోగొట్టుకున్న వాడివౌతావు**
**ఎందుకంటే**
**ఈ గుండెలో ఉండే వారెవరో తెలుసా?**
**నువ్వే !**

## మతం

కవిగారి తల్లిదండ్రులు సూసై మాణిక్యం, దేవనేసం అని క్రైస్తవ మతానికి సంబంధించిన పేర్లు కావడం మూలాన చెల్లప్పగారు క్రైస్తవ మతానికి చెందినవారని చెప్పొచ్చు. అయినా చెల్లప్పగారు 'నాగనాట్యం' అనే కవితా సంపుటిలో ఎక్కడా కూడా క్రైస్తవ మతానికి సంబంధించిన పదాలుగాని. వాక్యాలుగాని ప్రయోగించినట్లు కనబడడం లేదు. ఈయన ప్రకృతి ఆరాధ్యుడు. ఈయన కవితల్లో చాలా వరకు ప్రకృతినే పరమేశ్వరునిగా భావన చేశారన్న వైనం కనబడుతుంది. అంతేకాకుండా ప్రకృతిలో విలీనమైన అన్ని వస్తువుల్లో కూడా ఈయన పరమేశ్వరున్ని చూడగలుగుతున్నారు.

హిందూ ధర్మంలో ప్రత్యేకంగా చెప్పుకోదగ్గ రూపం అర్ధనారీశ్వర తత్త్వం . స్త్రీ పురుష మమైకం. అంటే సగం స్త్రీ, సగం పురుషుడు. ఈ తత్త్వం ప్రకృతిలో స్త్రీ పురుషులు ఇద్దరు సమానమే అన్న భావనను తెలియజేసెదిగా ఉంది. ఈ అర్ధనారీశ్వర తత్త్వాన్నే ప్రకృతిలో కనిపించే అన్ని వస్తువులోను కవిగారు చూశారు అనడానికి తార్కాణం **శివశక్తి దర్శనం** (పుట : 32) అన్న కవిత. ప్రకృతిలో ఉన్న ప్రతి వస్తువులోనూ విడదీయలేని అర్ధనారీశ్వర తత్త్వాన్ని ఈ కవితలో చూడవచ్చు.

**ప్రేమ స్వరూపమే శివమైతే**

**శివ ప్రదర్శనం నువ్వేగా**
**మంగళ వీణా శివమైతే**
**మధుర రాగాలు నువ్వేగా**
**సుందర పుష్పం శివమైతే**
**సుగంధ పరిమళం నువ్వేగా**
**పచ్చిక బయళ్ళు శివమైతే**
**పచ్చదనం నువ్వేగా**
**నెలికడలి శివమైతే**
**నిండు తరంగాలు నువ్వేగా**

పై కవితలో చెప్పబడ్డ వస్తువులు **వీణా - రాగం; పుష్పం - పరిమళం; పచ్చిక బయళ్ళు - పచ్చదనం; నీలి కడలి - తరంగాలు.** ఈ జంట పదాల్లో దేనిని కూడా విడతీయలేము. అందుకే కవి ప్రకృతిని అర్ధనారీశ్వర తత్త్వమైన శివ శక్తి స్వరూపంగా భావించారు.

పై కవితను చదువుతున్నప్పుడు ఎవరికైనా సరే కాళిదాసుని రఘు వంశంలోని -

**వాగర్థావివ సంవృత్తౌ**
**వాగార్థ ప్రతిపత్తయే**

**జగత: పితరౌ**
**వందే పార్వతి పరమేశ్వరౌ**

అన్న శ్లోకం గుర్తుకు రాక తప్పదు.

**కవితావళి** (16) అన్న ఇంకొక కవితలో

**కురుక్షేత్ర యుద్ధంలో**
**ముద్దుల కృష్ణుడు ముఖ దర్శనంలో**
**విశ్వరూపాన్ని చూపిన అర్జునునిలాగా**
**కదలని నీ కళ్ళ చూపులతో**
**ఆగని కాల ప్రవాహాన్ని నీవు**

**ఆపావుగా ?**

పై కవితలో వైష్ణవ మతానికి చెందిన కృష్ణుడు అనే దైవాన్ని ప్రత్యక్షంగా కవి వాడారు. ముందు చెప్పుకున్న కవితలో అర్ధనారీశ్వర తత్త్వాన్ని ప్రకృతి వస్తువుల్లో పరోక్షంగా చూచిన కవి హృదయం ఇక్కడ ప్రత్యక్షంగా చూస్తున్నది. అంతేకాకుండా ముందు కవితలో శైవాన్ని, ఈ కవితలో వైష్ణవాన్ని ఆదరిస్తున్నట్లు కనిపిస్తుంది. అంతేకాకుండా ఈయన పరమేశ్వరుని వెదకు సందర్భంలో 'నా జీవిత హజ్ లో తెలుసుకొన్నది' అన్న పాదంలో 'హజ్' అనే పదం మహమ్మదీయుల మతానికి సంబంధించిన పుణ్య స్థలమైన హజ్ ని ప్రయోగించడం వల్ల ఈయన ముస్లిం మతాన్ని కూడా ఆదరిస్తున్నట్లు తెలుస్తుంది.

ఈ రచన ముందు మాటలో 'మానవులందరి ఆత్మ ఒకటేనన్న సిద్ధిసాయి అంత:దృష్టిని ఈ కవితల్లో చూడవచ్చు' అని చెల్లప్పగారే అంటున్నారు. కాబట్టి మతం, దేవుడు, దర్శనం ఇవన్నీ పక్కన పెట్టి చూస్తే ఈయన కవితలన్నీ ఆత్మ పరమాత్మను చేరుకొనే వైనం గురించే చెప్పినట్లుగా కన్పిస్తుంది. అంతేకాదు ఆత్మ పరమాత్మ ఈ రెంటికి మధ్య మతాలు నిలువవు అనే జీవిత సత్యాన్ని ఈయన కవితల ద్వారా ఋజువు జేశారనే చెప్పాలి. మొత్తం మీద చెల్లప్పగారు తన కవితల ద్వారా భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించారు అనేది తేటతెల్లమవుతుంది.

## జీవిత భాగస్వామి

నాగనాట్యం కవితా సంపుటిలో జీవిత భాగస్వామికి సంబంధించిన కవితలు కూడా చోటుచేసుకున్నాయి. కవి తన జీవితంలో తనని మంచి బాటలో పయనింపజేసి, తన జీవితానికి కావలసిన అన్నిటిని సమకూర్చి ఇచ్చిన పరమాత్మునే తన జీవిత భాగస్వామిగా ఎంచుకొని, తన ఆత్మ విశ్వాసాన్ని ఏ విధంగా కనబరచారన్నది **ఋణానుబంధం** (పుట : 50) అన్న ఈ క్రింది కవితలో చూడవచ్చు.

**బతుకు బాటలో**
**పాతికేళ్ళు నడచిన నా బంగారు తీగ**
**ఆత్మ బాధపడినప్పుడల్లా**
**ప్రేమ హస్తాలతో**
**ప్రసాదించావు నాకు అన్నం**
**ఎన్ని జన్మలు ఎత్తినా**
**ఎలా తీరుస్తాను**
**నీ ఋణానుబంధం**

ఈ కవితలో జీవిత భాగస్వామిని వీడిపోయి కవి తాను పడుతున్న పాట్లు కనబడుతుంది. పరమేశ్వరుడు కళ్ళ ముందు ప్రత్యక్షమై మాయమైన దృశ్యాన్ని కవి మనముందుంచారు. పరమేశ్వరుని ప్రేమ భావాల్ని వెలిబుచ్చే మరొక కవిత **కానుక** (పుట : 48) ఇందులో పరమేశ్వరుడు తనమీద చూపుతున్న ప్రేమకు బదులుగా ఆయనకు ఏదైనా కానుక ఇవ్వాలనే తపన 'వాత్సస్య మూర్తివైన నీ ప్రేమకేది మూల్యం' అని ప్రశ్నించి, ప్రపంచంలో నిజమైన ప్రేమను వెలకట్టలేము అనే విషయాన్ని చాలా సున్నితంగా పరమేశ్వరుని పక్షాన నిలబడి కవి నిజమైన ప్రేమను కొనియాడారు.

## ప్రేమ ఊసులు

నాగనాట్యం అనే ఈ కవితా సంపుటిలో కవి పరమేశ్వరున్ని ప్రేయసిగాను తనను ప్రియుడుగాను భావించి చెప్పిన ప్రేమ ఊసులు ఎన్నో ఎన్నెన్నో. ఈ కవితా సంకలనలో ఉన్న కొన్ని కవితలు ప్రేయసి ప్రియుడులో ఊసులాడుతున్నట్లుగానూ, ప్రియుడు ప్రేయసితో ఊసులాడుతున్నట్లుగాను ఉన్నాయి. వాటిలో కొన్ని -

**ఆనాడు ఎందుకలా చూసావు?**
**నిర్మల హృదయంతో**
**నీ ఎదుట నిలబడ్డ నేను**
------------------
**నేటిదాకా ఓటమి ఎరుగని నేను**
**నీ కళ్ళచూపులో**
**కరిగిపోయాను! కలవర పడ్డాను!**
**ఏమీ ఎరుగని నాకు**
**ఎందుకీ శిక్ష?బాధా?**
--------------
**ఈ క్షణంలో**
**నీ సమక్షంలో**
**నా ఒటమిని**
**ఒప్పుకుంటున్నాను**
**ఇకనుంచైనా నన్నలా చూడకు**

**నీ చూపుకోసం** అనే మరొక కవితలో -

**ఎన్నో పనులుండగా**
**అన్ని విడిచిపెట్టి**
**నీ చిరునవ్వు కొరకై**
**ఏ దిగులు ఎరగని నీ కడగంటి**
**చూపుల కొరకై వచ్చాను**

అని ప్రేయసి కడకంటి చూపుల కోసం దహించే ప్రియునిలాగా, పరమేశ్వరుని ప్రేమ చూపుల కోసం తపించే మనస్సు ఇక్కడ తేటతెల్లంగానే తెలుస్తుంది. ఇలాగే ప్రేయసి ఇచ్చే ముద్దులు వెలకట్టలేనివి అని చెప్పిన **ముద్దుల హారం** (పుట : 10) అన్న కవితలోని -

**నీ చూడని చూపులో ఒక చూపుంది**
**దాని సుడిగాలి**
**గాలింపులో ఉంది చల్లదనం**
**----------------------**
**ఆకస్మాత్తుగా ఇచ్చిన ఒక ముద్దే**
**అమృత వర్షం నాకైతే**
**నీ ముద్దుల హారం విలువెంతో**

అన్న పై కవితా పాదాలు కవి, పరమేశ్వరుని చూచే ఈ ప్రశ్న వేశారా? అనే సంశయం కలుగుతుంది. ఇలాంటి భక్తి కూడా ఉంటుందా? పరమేశ్వరున్ని ఇలా కూడా భావన చేస్తారా? అని చదివేవారిని ఆశ్చర్య చకితుల్ని జేస్తుంది.

## దేహమే ప్రధానం

అజ్ఞానంలో మునిగి తేలి పరమేశ్వరున్ని వెదకి వెదకి వేసారి, విశ్వసృష్టికి ప్రేరణమైన మానవుల మధ్య ప్రసన్నమైన ప్రేమ/అనురాగం అనేది హృదయాంతరాల్లో పుట్టి, దేహమంతటా వ్యాపించి జీవిత చక్ర గమనానికి దారి చూపించి, చివరకు మట్టిలో చేరి కుళ్ళిపోయే శరీరమే కదా పరమేశ్వరుని చేరుకునేందుకు పనికి వచ్చే వాహనం. కుళ్ళిపోయే, మలంతో కూడిన శరీరంలో పొంగే ప్రేమయే కదా పరమేశ్వరుని చేరే ఆధ్యాత్మిక దారి. ఆ దారిలో పయనించేందుకు అశుభ్రమైన ఈ దేహం అవసరమే అనే దానిని వ్యక్తపరచే విధంగా **మలినమే మహా భాగ్యం** (పుట : 42) అనే ఈ క్రింది కవితా పాదాలు మనకు తెలియపరుస్తున్నాయి.

**మట్టిలో కలిసిన**
**మానవ ప్రేమలో**
**మలినం లేకుండునా?**
**అయినా మలినమే నాకు మహాబలం**
**మలినమే**
**మానవ ప్రేమకు మూలం**

## పరమేశ్వరుని వెదకుట

కవి పరమేశ్వరుని వెదకే వేటలో పూర్తిగా నిమగ్నుడైపోయాడు కాబోలు. పరమేశ్వరుడెక్కడ? పరమేశ్వరుడెక్కడ? అని అడవులు, కొండవాగులు అన్నీ వెదకి వెదకి వేశారిపోయి, పరమేశ్వరుని చూడలేకపోవడంతో చివరకు పరమేశ్వరుని ఎక్కడా కూడా చూడలేము అనే నిర్ణయానికి వచ్చినట్లుగా 'జవాబు లేని ప్రశ్న' అనే ఈ కవిత మనకు తెలుపుతుంది.

**నదీ మూలం కోసం వెదకుతూ**
**నడిచాను చాలాదూరం**
**నడిచి నడిచి**
**నా జీవిత హాజ్ లో**
**తెలుసుకున్నాను**
**కోటి మూలాలు గల**
**ఏటికేది మూలం?**
**ఏది తొలి మూలం**
**---------------**
**ఓ జవాబులేని ప్రశ్న కాబోలు**

నదీ మూలం ఋషి మూలాన్ని ఎవరూ కూడా తెలుసుకొన్న చరిత్ర కనబడదు. పురాణాల్లో కూడా పరమేశ్వరుని ఆది అంతాలైన శిరసు, పాదాల్ని కనుకొనే ప్రయత్నంలో బ్రహ్మ, విష్ణువులు చివరికి కనుక్కోలేక విఫలులైయ్యారు. వీరిలాగే కవి చెల్లప్పగారు కూడా పరమేశ్వరుని వెదకే వేటలో విఫలులయి, పరమేశ్వరుడు ఎక్కడ ఉన్నాడు? అనే ప్రశ్నకు జవాబు లేదని తెలుసుకున్నారు.

## భాషా శైలి

**చెల్లప్పగారి కవితల్లోని భాషా శైలిని ముందు పట్టికలో చూపినట్లు 8 రకాలుగా విభజించడం జరిగింది. వాటి వివరాలు :**

## భాషా సంప్రదాయం

తెలుగు బాషలో ఇంత వరకు ప్రయోగించని బాషా సంప్రదాయాలు చెల్లప్పగారి కవితల్లో అక్కడక్కడ కనబడుతున్నాయి. ఈ క్రొత్త బాషా ప్రయోగం చెల్లప్పగారి కవితల ద్వారా తెలుగు భాషలోకి ఆదాయంగా వచ్చిందనే చెప్పాలి.

ఉదాహరణకు -

## పూల వర్షం అనే కవితలో

**వేలు స్పర్శతోనే**

**ఏలుచున్నావు నా హృదయం (పుట : 1)**

వేలు స్పర్శతోనే నా హృదయాన్ని ఏలుచున్నావు అనే ప్రయోగం తెలుగు బాషకు అదనంగా వచ్చినట్లు తెలుస్తుంది. ఇటువంటి ప్రయోగాలు తెలుగు బాషకు కొత్త అనే చెప్పాలి. ఈ పుస్తకానికి అబినందన రాసిన డా. సి.నారాయణరెడ్డిగారు చెల్లప్పగారు ప్రకటించిన బావాలు కొన్ని వింతగా కనిపిస్తాయి. అయినా విలక్షణంగా బాసిస్తాయి అని అంటూ చూడని చూపులో చూపు ఉండడం, దాని సుడిగాలి లాంటి గాలింపులో చల్లదనం ఉండడం బావవైచిత్రికి తార్కాణాలు అని అంటారు.

## ప్రకృతి వర్ణన

సాధారణంగా సాహిత్యంలో ప్రకృతి వర్ణనల్ని పరిశీలించినపుడు ప్రకృతిని కవులు ప్రత్యక్షంగానో లేదా అలంకారాలను ప్రయోగించి వర్ణించడం జరుగుతుంది. అయితే **నాగనాట్యం** అనే ఈ కవితా సంపుటిలో చాలా వరకు కవితల్లో పంచభూతాల్ని ప్రకృతి వర్ణనలో ప్రయోగించారు. కొన్ని సందర్భాల్లో చెల్లప్పగారు కొత్త విధమైన సంకేతాలను ప్రయోగించి ప్రకృతిని వర్ణించారు. అంటే ఈయన ప్రత్యక్ష వర్ణన కాకుండా, దేనితోనూ పోల్చకుండా ప్రకృతి వస్తువుల్ని విశేషణాలుగా ప్రయోగించిన తీరు ఊహకు అందనవి. **అనంతవలయం** అన్న కవితలో -

**పడమటి కొండ చెట్టుకు పండిన**

**పొద్దు పండుని**

**గగన సీమలో కళ్ళు విప్పిన**

**నగ్న నక్షత్ర కన్యలని (పుట : 42)**

ఈ కవితలో **పడమటి కొండ చెట్టు, పొద్దు పండు, నగ్న నక్షత్ర కన్యలు** వంటి పదాలు విశేషణాల్ని వాడకుండా **పడమటి కొండ, పొద్దు, నక్షత్రం** ఈ పదాల్ని వేటితోను పోల్చకుండా నామావాచకాల లాగే ప్రత్యక్షంగా కవి ప్రయోగించిన తీరొక వింతే.

**వాయు ప్రసారం** అన్న కవితలో

**చెట్లనే చీరగా కట్టుకొన్న**

**ఆ చిన్ని కొండలు (పుట : 30)**

చెట్లనే చీరగా కట్టుకొన్న కొండలు - ఇలాంటి ప్రయోగాలు మరెక్కడా కూడా చూడలేమనిపిస్తుంది.

## ఉపమానాలు

సాహిత్యానికి అందాన్ని చేకూర్చేవి అలంకారాలు. వాటిలో ఉపమ అలంకారాన్ని చెల్లప్పగారు తమ కవితల్లో రెండు విధాలుగా ప్రయోగించారు. ఒకటి పద స్థాయిలో ఉపమానాల్ని ప్రయోగించడం. రెండు వాక్య స్థాయిలో ఉపమానాల్ని ప్రయోగించడం.

## పద స్థాయికి ఉదాహరణ

సాధారణంగా భూమిపైనున్న వస్తువుల్ని ఆకాశంలో ఉన్న వాటితో పోల్చడం మనకు కనిపిస్తుంది. విశాలమైన వీధుల్ని, పెద్ద పెద్ద పెళ్ళి పందిర్లను ఆకాశ వీధి (ఆకాశమంతటి విశాలమైన వీధి) అని, ఆకాశ పందిరి (ఆకాశమంతటి పందిరి) అని కవులు సామాన్యంగా పదాల్ని వాడుతుంటారు. కాని,

చెల్లప్పగారు తన కవితలో వాడబడ్డ పంచభూతాల్లో ఒకటైన ఆకాశాన్ని భూమి మీద ఉన్న వస్తువులతో అంటే ఆకాశాన్ని పల్లకిగాను, చెట్టు అందులోనూ కొమ్మల్లేని చెట్టుగాను పోల్చడం వింతలోనూ వింతే.

### వాక్య స్థాయికి ఉదాహరణ

నాగనాట్యం అనే కవితా సంపుటిలో చాలా చోట్ల కవి వాక్య రీతిలో ఉపమానాల్ని ప్రయోగించినట్లు తెలుస్తుంది.

**కురు క్షేత్ర యుద్ధంలో**
**ముద్దుల కృష్ణుడు ముఖ దర్శనంలో**
**విశ్వరూపాన్ని చూసిన అర్జునినిలాగా**
**కదలని నీ కాళ్ళ చూపులతో (కవితావళి పుట : 16)**

ఈ కవితలో కదలకుండా ఆగినపోయిన కళ్ళ చూపుల్ని కురుక్షేత్ర యుద్ధంలో కృష్ణుని ముఖాన్ని దర్శించినపుడు ఆయనలో కనబడ్డ విశ్వాన్ని చూచి ఆశ్చర్య పోయిన అర్జునునితో పోల్చబడింది. కాబట్టి ఇది వాక్యస్థాయి ప్రయోగం.

**ప్రేమాగ్ని** అనే కవితలో -

**కార్తీకమాసపు మెరుపులా**
**నీకంటి కదలికలో**
**అల్లాడిపోతోంది నా ఆత్మ**
**నలిగిన నా గుండె తోటలో**

పై కవితా పాదాల్లో కవి, కంటి కదలికను కార్తీక మాసం మంచి వర్షా కాలం ఆ కాలంలో ఆకాశంలో మెరిసే మెరుపుతో పోల్చి చెప్పారు.

### పద ప్రయోగాలు

నాగనాట్యం అనే కవితా సంపుటిలో చాలా తేలికైన, త్వరలో అర్థం చేసుకోగలిగిన పదాల్నే కవిగారు తన కవితల్లో ప్రయోగించారు. ఆకాశం, నీరు, అగ్ని, గాలి, భూమి అనే పంచభూత నామాల్ని ఎక్కువగా ప్రయోగించారు. గుండె, ప్రేమ, ఆత్మ, ప్రపంచం, కళ్ళు, చిరునవ్వు వంటి పదాల్ని ఎక్కువ ప్రయోగించారు. ఉదాహరణకు 'గుండె' అనే పదాన్ని మాత్రం 50 కవితల్లో 40 చోట్ల ప్రయోగించారు. వాటి వివరాలు క్రింది పట్టికలో చూపబడింది.

| క్ర.సం | కవితా శీర్షిక | కవితా పాదం | పుట సంఖ్య |
|---|---|---|---|
| 1 | నా ఒటమి | నా గుండెను గుచ్చి కుతూహలించాయి | 2 |
| 2 | చూపుకోసం | ఒప్పుకోలేదు నా గుండె | 5 |
| 3 | రూపూ చూపూ | కాదని అంది నా గుండె | 6 |
| 4 | చూడగా చూడగా | నా గుండె ఏరు పొంగుతోంది | 7 |
| 5 | ముద్దుల ముచ్చట్లు | మురిసింది నా గుండె | 9 |
| 6 | నిజ స్వరూపం | చిగురించే నా చిట్టి గుండెలో | 12 |
| 7 | ప్రేమకావ్యం | గంగా కావేరిలా పొంగే నా గుండె | 13 |
| 8 | ఆత్మ రాగాలు | నా గుండెలో ఎన్నడూ ఉదయించలేదు | 14 |
| 9 | నవం నవం శుభం శుభం | నా గుండె భూమిలో పడి | 15 |
| 10 | అరంగేట్రం | నా గుండె రక్తంతో | 17 |
| 11 | మూగవాడి గోల | ఎండిపోతోంది నా గుండె | 19 |
| 12 | నవ్వుతోంది ఆ చెట్టు | నవ్వలేక ఏడుస్తోంది నా గుండె | 20 |
| 13 | ప్రేమాగ్ని | నలిగిన నా గుండె తోటలో | 21 |
| 14 | తియ్యని మాట | కళ్ళు విప్పింది నా గుండె | 22 |
| 15 | ఓలి | గుండె గర్భంలో మొలచి | 25 |
| 16 | జీవిత రణరంగం | గుండెను కోసి | 27 |
| 17 | అద్వైత ప్రేమ | గుండె కొట్టింది మేళం | 28 |

| | | | |
|---|---|---|---|
| 18 | గుండె సన్నాయి | నిత్యము మ్రోగే గుండె సన్నాయి | 29 |
| 19 | గుండె సన్నాయి | గుండె సన్నాయి పాడక ముందే | 29 |
| 20 | వాయు ప్రసాదం | చిన్నగా నలిగిన నా గుండె | 30 |
| 21 | స్మృతిగా స్మృతిగా | నా గుండె కోనేటిలో | 31 |
| 22 | స్మృతిగా స్మృతిగా | నా గుండెను కురుక్షేత్రం చేస్తోంది | 31 |
| 23 | ముత్యాల అనుభవం | గొణుకుతోంది నా గుండె | 33 |
| 24 | జవాబు లేని ప్రశ్న | గుండెలో పుట్టి | 34 |
| 25 | ప్రేమ బిందు | నా గుండె తోటలో | 35 |
| 26 | ప్రేమ బిందు | జీవరాశుల గుండెలో | 35 |
| 27 | ప్రేమాకో హద్దు | కొండలకన్నా గొప్పది గుండె | 36 |
| 28 | ప్రేమకో హద్దు | మ్రోగుతోంది నా గుండె | 36 |
| 29 | విడిపోయిన ముక్క | నవయుగం వెలసింది నా గుండెలో | 39 |
| 30 | జ్ఞానాగ్ని | నా చిన్న గుండెలోంచి | 40 |
| 31 | జ్ఞానాగ్ని | గుండె తోటలో | 40 |
| 32 | జ్ఞానాగ్ని | విరిగిపోయిన నా గుండె ముక్కలని | 40 |
| 33 | ప్రమిద | ఇంకో గుండెను పారేసేందుకు | 44 |
| 34 | ప్రమిద | ఈ గుండెను | 44 |
| 35 | ప్రమిద | సరిగమలూదే నా గుండెని వదిలేస్తే | 44 |
| 36 | ప్రమిద | ఈ గుండెలో ఉండేవారెవరో? | 44 |
| 37 | పసిగడ్డి ఉయ్యాల | నీ ప్రేమ ముద్దుల గుండెను | 45 |
| 38 | కెరటాల కన్యలు | నా గుండె గుడిలోంచి పరిమళించే | 46 |
| 39 | నా ఫోటో | గుండెలో నిలిచావే గోదమ్మ | 11 |
| 40 | రెక్కలున్న నిమిషాలు | గుండెలో మాత్రం | 3 |

## ఇతర భాషా పదాలు

చెల్లప్పగారి కవితా సంపుటిలో ఇతర భాషా పదాల్ని గనుక పరిశీలిస్తే చాలా తక్కువ మోదాదులోనే ప్రయోగించారని చెప్పాలి. తెలుగు భాషలో సామాన్యంగా సంస్కృత భాషా పదాలు కలిసి ఉండడం విదితమే. వాటిని పక్కన పెట్టి చూచినట్లయితే, **ఫోటో**(పుట : 11), **అరంగేట్రం**(పుట : 17), **కుమరి**(పుట : 18), **పొన్నూరు**(పుట : 21), **హజ్**(పుట : 34), **మెట్ల**(పుట : 38), **ఒరియన్**(47) వంటి మొత్తం ఏడు మాత్రమే ఇతర భాషా పదాలుగ కనబడుతున్నాయి.

## గుర్తులు

చెల్లప్పగారు తన కవితల్లో ప్రశ్నార్థకం మరియు ఆశ్చర్యార్థకం అనే రెండు గుర్తులు మాత్రమే వాడారు. అయితే చాలా చోట్ల ఆశ్చర్యార్థక గుర్తు రావలసిన చోట ప్రశ్నార్థక గుర్తును వాడారు. ఇలా వాడడంలో ఉన్న అంతరార్థం ఏమిటో తెలియకుంది. ఈ కవితా సంకలనంలో ఏడు కవితల్లో ఆశ్చర్యార్థక గుర్తు రావలసిన చోట్ల ప్రశ్నార్థక గుర్తును వాడిన సందర్భాలు -

- రచించి నటించాను కూడా? (పుట : 4)
- ఏ దిగులు ఎరగని ని కడకంటి చూపుల కొరకు వచ్చాను?(పుట : 5)
- ఆభరణం ధరించని అందాల ఆభరణమా?(పుట : 6)
- ఉక్కు ములుకుల్లాంటి ఆ చూపులతో ఇక చూడకలా?చూడకలా?
- ఇక అసాధ్యం అమర జీవితం? (పుట : 27)
- తెచ్చిన ముత్యాలు కొంచమని

తేవలసింది ఎక్కువని

గొణుకుతోంది నా గుండె?

- శివ ప్రదర్శనం నువ్వేగా?

మధుర గానాలు నువ్వేగా?

సుగంధ పరిమళం నువ్వేగా?

పచ్చదనం నువ్వేగా?

కళ్ళకాంతి నువ్వేగా? (పుట : 32)

## నేనే ప్రశ్న నేనే జవాబు

నాగనాట్యం కవితా సంపుటిలో మూడు కవితల్లో చివరి రెండు వరుసల్లో మొదటి వరుస ప్రశ్నతోను రెండవ వరుస సమాధానంగాను అమర్చిన ఈ పద్ధతి తక్కిన కవిత్వకారుల నుండి చెల్లప్పగారిని వేరుచేసి చూపేదిగా ఉంది. అవి :-

**చూపుకోసం(పుట : 5)** అన్న కవితలో -

**క్షణంలో ముగిసేది కాదుగా**

**ని సహవాసం?**

**అందుకే నేను చూడలేను.**

ప్రమిద(పుట : 44) అన్న కవితలో -

**ఈ గుండెలో ఉండే వారెవరో తెలుసా?**

**నువ్వే**

**కెరటాల కన్యలు** (పుట : 46) కవితలో -

**ని ప్రేమ ఉన్నంత వరకు**

**వాడవు ఈ కవితా పుష్పాలు**

**ఎందుకంటే?**

**ఇవి చెక్కని సజీవ శిల్పాలు**

**చెరగని యోగ ముద్రలు**

చెల్లప్పగారి కవితల్లో ఇంకొక పద్ధతి కవిత్వం చివరిలో ప్రశ్నతో ముగించే విధానం. ఈ పద్ధతిలో మొత్తం 15 కవితలున్నాయి. అవి :-

ముద్దు ముచ్చట్లు, ముద్దుల హారం, ప్రేమకావ్యం, నవం నవం శుభం శుభం, అరంగేట్రం, మూగవాడి గోల, తియ్యని మాట, ఓలి, అద్వైత ప్రేమ, స్మృతిగా స్మృతిగా, జవాబు లేని ప్రశ్న, వలపు సాగు, జ్ఞానాగ్ని, కానుక, రుణానుబంధం.

మచ్చుకు కొన్ని -

- ➢ వాత్సల్యమూర్తివైన ని ప్రేమకేది మూల్యం? (కానుక:48)
- ➢ ని దివ్య సన్నిధిలో

ఎప్పటికీ నేనొక మూగవాణ్ణేనా?(మూగవాడి గోల:19)

- ➢ ఈ కవితా పుష్పం కొత్తది కాదా?(నవం నవం శుభం శుభం : 15)

## మనసు మాట

చెల్లప్పగారి కవితలు చాలా వరకు మనసు మాట్లాడుతున్నట్లే అనిపిస్తుంది. ఒక మనిషి పరమాత్ముని యందు గల గాఢమైన భక్తి కారణంగ తనలో కలిగే భావాలే భగవంతునిపై ప్రేమగాను, అనురాగంగాను పరిణమించి ఒక స్థాయిలో తనలో తానే మాట్లాడుకోవడం జరుగుతుంది. ఈ విధంగానే చెల్లప్పగారి కవితలు చాలా వరకు మనసు మాట్లాడుతున్నట్లే ఉంటుంది. వాటిలో -

**మూగవాడి గోల** - కవితలో కవి మనసులోనే ఇలా వాపోతాడు.

**నిన్నోమాట అడగాలని**

**ఎన్నో రోజులుగా ఎదురు చూస్తూ**

**నిలబడ్డాను ని ఎదుట**

నీ సౌందర్య కిరణాలు తగలగానే
ఎండి పోతుంది నా గుండె
ఎడారిగా మారిపోతున్నాయి నా పెదవులు
ఎక్కడ పోయిందో నా మాట?
నీ దివ్య సన్నిధిలో
ఎప్పటికి నేనొక మూగవాడినేనా?

డా. చెల్లప్ప IAS గారి **నాగనాట్యం** అనే కవితా సంకలనాన్ని పై విధంగా పరిశీలించి నప్పుడు ఈ క్రింది అంశాలు తెలియవచ్చాయి.

- చెల్లప్పగారి కవితల్ని పైపైగా చూసినప్పుడు చాలా వరకు కవితలు ప్రేమను ప్రధానంగా ఎంచి, పైకి సున్నితంగ కనబడినా, వాటిని లోతుగా పరిశీలించినపుడు ప్రేమానురాగాల్ని దాటి దైవభక్తి, ఆత్మ కదలిక,పరమాత్ముని చేరుట, ముక్తి మరియు జీవాత్మ పరమాత్మ ఒకదానిలో ఒకటి ఐక్యమవడం వంటి వాటిని పరమేశ్వరుని పక్షాన నిలబడి ఆనంద డోలికల్లో పయనిస్తున్నారు అంటే అతిశయోక్తి కాదు.
- ఈయన కవితలన్నీ మనసు మాట్లాడే మాతలుగానే ఉన్నాయి.
- జీవాత్మ పరమాత్మ ఈ రెంటికి మధ్య కులమత బేదాలు లేవు అనే సత్యాన్ని చెల్లప్పగారి కవితలు రుజువు జేస్తున్నాయి.
- ఈయన కవితల్లో ప్రయోగించిన వర్ణనలు, ఉపమానాలు చాల విడ్డూరంగాను, వింతగాను ఉన్నందువల్ల ఈయన ప్రకృతి పరమ ఆరాధ్యుడు అనేది తేటతెల్లమయింది.
- ఈయన ముందుమాటలో "తమిళ కవి కలము నుండి జాలువారిన కవితలు" అని చెప్పారు. కాని **నాగానాట్యం** కవితా సంపుటిని పరిశిలించినపుడు ఎక్కడా కుడా తమిళ వాసన(అరంగేట్రం, పొన్నూరు, కుమరి పదాలు మినహా) కనబడలేదు. పైగా ఈ కవితలు ఒక తమిళుడి కలం నుండి జాలువారిన కవితలు అనడానికి ఎక్కడా కూడా తావు లేకుండా, స్వచ్చమైన తెలుగు కవిగానే ప్రత్యక్షమవుతున్నారు చెల్లప్పగారు అంటే అది సరైనదే అవుతుంది.
- ఈయన కలం నుండి వేలాది వేల తెలుగు కవితలు పొంగి పొరలి తెలుగు సాహిత్య పుడమి తల్లిని అలంకరించాలని తెలుగువారి తరపున ప్రార్థించి, కవిగారి ఆధ్యాత్మిక ప్రయాణం చక్కగా కొనసాగాలని కోరుతూ, ఈయన ఆరాధిస్తున్న ప్రకృతి ఈయనకు శారీరిక, మానసిక బలాన్ని చేకుర్చి, దీర్ఘాయుషుని ఇవ్వాలని మనసార భగవంతుని ప్రార్థిస్తున్నాను.

## References


1. సత్యరాజ్. త. (2018): మికోడ్డాపడు తొల్కాప్పియ మూలముమ్ ఉర్రైయుమ్, ఇనమ్ ప్రచురణ, కోయంబత్తూర్.
2. చెల్లప్ప. ఎన్. (2009) : నాగనాట్యం, ఆస్ గ్రాఫిక్స్, హైదరాబాదు.
3. లక్ష్మణయ్య సముద్రాల (2017): రఘువంశం, తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ, తిరుపతి.



## Funding

This study was not funded by any grant.


## Conflict of interest

The Author declares that they have no actual or potential conflict of interest, including financial, personal, or other relationships with people or organizations that could have inappropriately influenced this work.


## About the License

© The Author 2022. The text of this article is open access and licensed under a Creative Commons Attribution 4.0 International License



## Cite this Article

CH. Savithri, Descriptive the language style of Naganatyam, Indian Journal of Multilingual Research and Development, Vol 3, Iss 2 (2022) 1-15. DOI: https://doi.org/10.54392/ijmrd2221